క్లుప్తంగా

నేడు చినపాండ్రాకలో గడప గడపకు మన ప్రభుత్వం

కృత్తివెన్ను: మండలంలోని చినపాండ్రాక గ్రామంలో శనివారం ఉదయం 9 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరగనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వెంకట్రాజు తెలిపారు. కార్యక్రమంలో పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక పాల్గొంటారని పేర్కొన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

కోడూరు: ప్రభుత్వం ఈ నెల 3వ తేదీన నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోడూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రతిమ అన్నారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుందని, ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల మందు వేయనున్నట్లు చెప్పారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు ప్రత్యేక శిబిరాల్లో సిబ్బంది చుక్కల మందు వేస్తారన్నారు. నూరు శాతం చుక్కల మందు వేసేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారి కోరారు.

కార్తికేయునికి వెండి నాగపడగ సమర్పణ



మోపిదేవి: స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి నరసరావుపేటకు చెందిన భక్తుడు అనుమోలు జగదీష్‌కుమార్ 570 గ్రాములతో చేసిన వెండి నాగపడగను సమర్పించారు. శుక్రవారం ఉదయం స్వామి వారిని దర్శించుకున్న ఆయన వెండి పడగను ఆలయ అధికారులకు అందజేశారు. అనంతరం జగదీష్‌కుమార్‌ను ఆలయ మర్యాదలతో సత్కరించారు. అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడికి ప్రత్యేక అభిషేకాలు

పెదకమ్మవారిపాలెం(నాగాయలంక): స్థానిక గ్రామ భక్తసమాజం, శ్రీగాయత్రీ సేవా ట్రస్ట్ (నల్లూరు- రేపల్లె) ఆధ్వర్యాన స్థానిక రామాలయంలో జరుగుతున్న శ్రీరామ వైభవోత్సవాల్లో శుక్రవారం శ్రీరాముడికి శాస్త్రోక్తంగా అభిషేకాలు చేశారు. తొలుత సుప్రభాత సేవ, తోమాలసేవ అనంతరం ట్రస్ట్ నిర్వాహకుడు, వేద పండితుడు ఆరేమండ చక్రవర్తి బ్రహ్మత్వంలో సర్పంచ్ తలశిల అర్జునరావు, సునీత దంపతులతో అభిషేకాలు, సహస్ర నామార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా రేపల్లెకు చెందిన మహాలక్ష్మి భక్త సమాజం సభ్యులు భజన, భక్తిగీతాలపన చేశారు. అనంతరం అష్టోత్తర శత దీపోత్సవం, పవళింపు సేవ జరిగాయి. ఉత్సవ నిర్వాహక కమిటీ ప్రతినిధులు సబ్బనేని పద్మజ, తలశిల నాగలక్ష్మి పర్యవేక్షణలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సహకార సంఘం ఆర్థిక చేయూత



కృత్తివెన్ను: సహకార సంఘంలో సభ్యులు మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక చేయూత అందించినట్లు కృత్తివెన్ను సహకార సంఘం అధ్యక్షుడు కూనసాని లక్ష్మోజీ తెలిపారు. తమ సంఘంలో సభ్యత్వం ఉన్న కొమాళ్లపూడికి చెందిన ఇళ్ల భాగ్యలక్ష్మి, చెరుకుమిల్లికి చెందిన పట్టపు సీతామహాలక్ష్మి ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులకు సంఘ నిబంధనల ప్రకారం ఒక్కొక్కరికి పదివేల రూపాయలను అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గరుడప్రసాద్, సంఘ సీఈవో సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు అంత్యక్రియలు



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలులోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారి గోశాలలోని గోమాత అనారోగ్య కారణాలతో శుక్రవారం మృతి చెందింది. 20 సంవత్సరాల క్రితం చల్లపల్లికి చెందిన యాదవరాజులు ఈ గోవును ఆలయానికి మొక్కుబడిలో భాగంగా అందజేసినట్లు ఆలయ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరావు తెలిపారు. మృతి చెందిన గోవును ట్రాక్టర్‌పై ఊరేగింపుగా తరలించి కూరపాటి సాంబశివరావు పంటపొలాల్లో సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. మండల పరిసరాల్లో 400 పైగా శుభకార్యాల్లో గోవు పాల్గొన్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కుర్రా గురుప్రసాద్ తెలిపారు. కమిటీ సభ్యుడు యడ్ల శేషుబాబు, స్థానికులు పాల్గొన్నారు.

రైతుకు భరోసా

- 'పెడన'లో 67 ఆర్బీకేలు
- ఒక్కో ఆర్బీకే నిర్మాణానికి రూ.21.80 లక్షలు
- 22,823 మందికి రైతుభరోసా కింద రూ.92.62కోట్లు



పెనుమల్లి ఆర్‌బీకే వద్ద విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచు వెంకటరామానాయుడు తదితరులు (ఫైల్)



పెడన మండలం పుల్లపాడు ఆర్‌బీకే



పెనుమల్లి ఆర్‌బీకే

పెడన: రైతుకు ప్రభుత్వం భరోసా ఇస్తోంది. వారి అవసరాలకు రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. గతంలో రైతులు ప్రభుత్వ సేవలను పొందాలంటే మండల కేంద్రాలకు, ఆ తర్వాత డివిజన్, జిల్లా కేంద్రాలకు పోవాల్సిన దుస్థితి ఉండేది. విత్తనాల కోసం గత ప్రభుత్వాల్లో బారులు తీరే దుస్థితి నెలకొనేది. ఎరువులు కోసం బయట మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేసేవారు. అలాంటి పరిస్థితులు లేకుండా రైతులకు ఖర్చు భారం తగ్గిస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి గ్రామాల పరిధిలోనే ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతులకు అందాల్సిన సంక్షేమ పథకాలే కాకుండా ఇన్‌పుట్ సబ్సిడీ, యంత్ర పరికరాల సబ్సిడీ, విత్తనాలు, ఎరువులు అన్నీ గ్రామ స్థాయిలోనే అందుతున్నాయి. ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడానికి పెడన నియోజకవర్గంలో 67 రైతుభరోసా కేంద్రాలను మంజూరు చేసింది. ఒక్కో భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.21.80 లక్షలు కేటాయించింది. వీటిల్లో కొన్ని భవనాలు పూర్తవ్వగా మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. నిర్మాణాలు పూర్తి కాని ప్రాంతాల్లో తాత్కాలిక అద్దె భవనాల్లో కొనసాగిస్తూ రైతులకు సేవలందిస్తున్నాయి.

- పెడన మండలంలో 17 రైతు భరోసా కేంద్రాలకు రూ.3.70 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఏడు చోట్ల పూర్తవ్వగా మిగిలిన చోట్ల పనులు జరుగుతున్నాయి. పెనుమల్లి, గురువిందగుంట, పుల్లపాడు, బల్లిపర్రు, కొప్పల్లి, నడుపూరు, కమలాపురంలో పూర్తయ్యాయి.
- గూడూరు మండలంలో 17 ఆర్బీకేల్లో ఒక్కో యూనిట్‌కు రూ.21.80 లక్షలు చొప్పున మొత్తం రూ.3.70 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో పోలవరం, ఐదుగుళ్లపల్లి(రామన్నపేట), కప్పలదొడ్డి, లేళ్లగరవు, మల్లవోలు-1, మల్లవోలు-2, రాయవరం, కంచాకోడూరు, కంకటావ, ఆకులమన్నాడు, పోసివారిపాలెంలో పూర్తయ్యాయి. మిగిలినవి నిర్మాణ దశలో ఉన్నాయి.
- కృత్తివెన్ను మండలంలో ఆక్వా కల్చర్‌కు సంబంధించి తొమ్మిది, అగ్రికల్చర్‌కు సంబంధించి 8 మొత్తం 17 మంజూరయ్యాయి. రూ. 3.70 కోట్లు కేటాయించారు. ఈ తొమ్మిదిలో లక్ష్మీపురం, నిడమర్రు-2లలో ఆర్బీకేలు పూర్తై సేవలందిస్తున్నాయి. మిగిలిన చోట్ల పనులు జరుగుతున్నాయి.
- బంటుమిల్లి మండలంలో 16 ఆర్బీకేలు మంజూరవ్వగా రూ.3.48 కోట్లు కేటాయించారు. ముంజులూరు, ఆముదాలపల్లి, కంచడం, ఆర్తమూరు(మణిమేశ్వరం)లో నిర్మాణాలు పూర్తి చేసుకున్నాయి. మిగిలిన చోట్ల ఆర్బీకేలు నిర్మాణ దశల్లో ఉన్నాయి.

రైతులకు పంటల బీమా.. వైఎస్సార్ సున్నా వడ్డీ..

రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడమే కాకుండా పంటల బీమా కింద పెడన నియోజకవర్గంలో 11,390 మంది రైతులకు రూ.18,29,08,021 అందజేశారు. వైఎస్సార్ సున్నా వడ్డీ కింద పంట రుణాలను 9,220 మంది రైతులకు రూ.2,01,10,954 అందజేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద 17,240 మంది రైతులకు రూ.13,83,34,945 రైతు ఖాతాల్లో జమ చేశారు. ఇవే కాకుండా ఏటా రైతుభరోసా పథకం ద్వారా పెడన నియోజకవర్గంలో 22,823 మంది రైతులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.92.62 కోట్లను జమ చేసింది. ఇవే కాకుండా రైతు గ్రూపులకు సబ్సిడీపై ఇన్విస్టర్లును అందజేసింది.

విత్తనాలు, ఎరువులు కూడా ఇస్తోంది. ఎలుకల నివారణ మందులను ఉచితంగా కూడా అందజేస్తూ రైతుల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దోహదం చేస్తూ రాజును చేస్తోంది.

సేవలు బాగున్నాయి



గతంలో వ్యవసాయశాఖ అధికారుల వద్దకు మేమే వెళ్లేవాళ్లం. ఎరువులు కావాలన్నా, విత్తనాలు తెచ్చుకోవాలన్నా మండల కేంద్రాలకు పోయే వాళ్లం. అక్కడ లేకపోతే జిల్లా లేదా పక్క జిల్లాకు పోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం ఇటువంటి ఇబ్బందులు ఏమీ లేవు. అధికారులు కూడా మా వద్దకు వస్తున్నారు. మాకు గ్రామ వ్యవసాయశాఖ సహాయకురాలు అందుబాటులో ఉంటున్నారు. సలహాలు, సూచనలు కావాలన్నా ఇస్తున్నారు. ఆర్బీకే సేవలు మాకు చాలా ఉపయోగకరంగా ఉంటున్నాయి.

–సమ్మెట వెంకట్రామయ్య, రైతు, నేలకొండపల్లి

అభివృద్ధిని చూసి అభినందించకుండా విమర్శలా

–పేర్ని కిట్టు



నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులు అభినందించకుండా విమర్శించడం ఎంతవరకు సబబు అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ప్రశ్నించారు. నగరంలోని 16వ డివిజన్‌లో శుక్రవారం సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు, 40వ డివిజన్‌లో నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులకు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మతో కలిసి పేర్ని కిట్టు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మునుపెన్నడూ జరగని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో అభివృద్ధి జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీలు అభినందించకపోగా ఏ అభివృద్ధి జరగలేదంటూ విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు చూశారని రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు తమ ఓటుతో సమాధానం చెబుతారన్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని నాయీబ్రాహ్మణులకు 2008లో ఈ స్థలాన్ని కేటాయించారన్నారు. వీరి కోరిక మేరకు భవనాన్ని కూడా నిర్మిస్తామని హామీ ఇచ్చారన్నారు. దీనిప్రకారం రూ. 50 లక్షలతో ఇక్కడ భవనం నిర్మించనున్నామన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చటంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పేర్ని నాని ముందుటారనడానికి ఇదే నిదర్శనమని చెప్పారు. మేయర్ వెంకటేశ్వరమ్మ మాట్లాడుతూ నగరంలోని నాయీబ్రాహ్మణులు శుభకార్యాలు చేసుకునేందుకు భవనం లేక నానా ఇబ్బందులు పడేవారన్నారు. ఎమ్మెల్యే పేర్ని నాని కృషితో వీరికి స్థలం కేటాయింపుతో పాటు నేడు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. నాయిబ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు సుధాకర్, గౌరవాధ్యక్షుడు తరకటూరి సీతారాముడు మాట్లాడుతూ ఎమ్మెల్యే పేర్ని నాని ఇచ్చిన మాట ప్రకారం తమ సంఘానికి భూమి కేటాయించి కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు చేయడం అభినందనీయమన్నారు. తమ సంఘం ఎమ్మెల్యే పేర్ని నానికి, కిట్టుకు ఎప్పటికీ రుణపడి ఉంటుందన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదా, కార్పొరేటర్ రాసంశెట్టి వాణిశ్రీ, మాజీ కౌన్సిలర్లు చిటికిన నాగేశ్వరరావు, కొల్లు రమేష్, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జులు గోళ్ల పాండురంగారావు, భోగిరెడ్డి వెంకటేశ్వర్లు, మొహమ్మద్ రఫీ, సంఘ కార్యదర్శి వి.నాగేంద్రబాబు, కోశాధికారి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

హస్తకళలను ఆదరించాలి



ప్రదర్శనలో వస్త్రాలను తిలకిస్తున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: హస్తకళ, చేనేత కార్మికులు తయారుచేసిన వస్త్రాలను కొనుగోలు చేసి కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బందరు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. నగరంలోని పిన్నమనేని టీచర్స్ గిల్డ్‌హోమ్ భావనారుషి చేనేత హస్తకళ కార్మిక సేవా సమితి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ, హ్యాండ్లూమ్, హ్యాండీక్రాఫ్ట్ ప్రదర్శన, అమ్మకాలను ఆమె శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన హస్తకళ, చేనేత ఉత్పత్తులను ఈ ప్రదర్శనలో ఉంచారని నగర ప్రజలు వీటిని కొనుగోలు చేసి కార్మికులను ప్రోత్సహించాలన్నారు. ఆర్గనైజర్లు బట్టు సురేష్, అందే శ్రీను మాట్లాడుతూ మార్చి 17వ తేదీ వరకు వస్త్రాల ప్రదర్శన, అమ్మకం ఉంటుందన్నారు. పోచంపల్లి, నారాయణ్‌పేట్, ఉప్పాడ, చీరాల, మంగళగిరి, కలంకారీ, ఫ్యాన్సీ ఖాదీ, బెంగాల్ సిల్క్ తదితర వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

మచిలీపట్నంలో 85.79 శాతం పింఛన్ల పంపిణీ



36వ డివిజన్‌లో వికలాంగురాలు రజనికి పింఛను అందజేస్తున్న వలంటీర్ సూర్య

మచిలీపట్నంటౌన్: జిల్లా కేంద్రం మచిలీపట్నంలో వైఎస్సార్ సామాజిక పింఛన్ పంపిణీ శుక్రవారం తెల్లవారుజాము నుంచే వలంటీర్లు లబ్ధిదారులకు అందజేశారు. శుక్రవారం సాయంత్రానికి 85.79 శాతం పింఛన్లు పంపిణీ చేసి జిల్లాలో రెండోస్థానంలో నిలిచింది. నగరంలో 19,194 పింఛన్లు ఉండగా వీటిలో 16,466 మందికి అందజేశారు. ఇంకా 2,728 పింఛన్లు అందజేయాల్సి ఉంది.

జీజీహెచ్ ఏవోగా రమేష్‌బాబు



మచిలీపట్నంటౌన్: జిల్లా సర్వజన ఆసుపత్రి అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా వడ్డి రమేష్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన జీజీహెచ్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. ఈయనకు పదోన్నతి రావటంతో ఇక్కడే ఏవోగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను అధికారులు, సిబ్బంది అభినందించారు.

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

అవనిగడ్డ: స్థానిక పంచాయతీ పరిధిలోని సింహాద్రి కాలనీకి చెందిన ముళ్లపూడి వెంకటనరసమ్మకు వైద్యఖర్చుల కోసం శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. వెంకటనరసమ్మ భర్త వెంకటేశ్వరరావు ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో చనిపోయారు. వెన్నెముక సమస్యతో ఇబ్బంది పడుతున్న వెంకటనరసమ్మకు ఈ సాయం అందజేశారు. కార్యక్రమంలో తోట నరసింహనాయుడు, దేగల రాఘవ, సాయిఫణీంద్ర, అలపర్తి గోపి, ముళ్లపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

పెడన: ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ఇంటర్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పెడనలోని శ్రీబొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 203 మంది విద్యార్థులకు 194 మంది హాజరవ్వగా 9 మంది ఆబ్సెంట్ అయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఎంవీఎస్ఎస్ మహేష్‌బాబు, డీవో శాంభవి తెలిపారు. విజయానంద జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో 67 మందికి 65 మంది హాజరయ్యారని, ఇద్దరు ఆబ్సెంట్ అయ్యారని సీఎస్ ఆదివిష్ణు, డీవో ఎండీ మున్వర్లు తెలిపారు. ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆయా కేంద్రాల అధికారులు పేర్కొన్నారు.

రబీ ఈ క్రాప్..ఈకేవైసీలపై అభ్యంతరాలుంటే తెలపండి



పెనుమల్లి ఆర్‌బీకేలో మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరావు

పెడన: రబీ ఈ క్రాప్..ఈకేవైసీలు పూర్తి చేశారని, ఆయా జాబితాలను ఆర్‌బీకేలలో ప్రదర్శనకు ఉంచామని, వాటిని చూసుకుని రైతులు అభ్యంతరాలుంటే ఈ నెల 3వ తేదీలోగా తెలియజేయాలని పెడన వ్యవసాయశాఖాధికారి జీవీ శ్రీనివాసరావు అన్నారు. ఆయన పెడన మండలం పెనుమల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ క్రాప్, ఈకేవైసీలు గత నెల 29వ తేదీతో పూర్తయ్యాయన్నారు. ఆయా జాబితాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శనకు ఉంచామని, వాటిని చూసుకుని వాటిల్లో ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. రైతు పేరు, ఆ రైతు ఏ పంట ఎంత విస్తీర్ణంలో వేసింది, ఆ పంట రకం తదితర వివరాలుంటాయన్నారు. వాటిలో ఏమైనా తప్పులున్నా, పొరబాట్లు ఉన్నా తెలియజేస్తే వాటిని తక్షణం పరిష్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో పెనుమల్లి, నేలకొండపల్లి సర్పంచులు గరికపాటి వెంకటరామనాయుడు, ఊచ వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీపీ రాజులపాటి అచ్చుతరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండవీటి నాగబాబు, వీఏఏ శిరీష, వీఆర్వో గోవిందరాజులు, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధన.. ప్రత్యేక సాధన

- పదో తరగతి విద్యార్థులపై ఫోకస్
- మార్చి 18 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం



గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

గూడూరు: పాఠశాల స్థాయిలో పదో తరగతి కీలకం. విద్యార్థి ఉజ్వల భవితకు పదో తరగతి తొలిమెట్టు. పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణత సాధించడానికి అటు ఉపాధ్యాయులు.. అత్యుత్తమ మార్కులు సాధించాలని విద్యార్థులు పట్టుదలతో కృషి చేస్తున్నారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి జరగనున్నాయి. గూడూరు మండలంలో మొత్తం ప్రభుత్వం పాఠశాలల్లోని 399 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. ఈ నేపథ్యంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. పునఃశ్చరణ తరగతులు నిర్వహిస్తూ పాఠ్యాంశాల వారీగా విద్యార్థులను సంసిద్ధులు చేస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా ఫలితాల సాధనకు కృషి చేస్తున్నారు.

పరీక్షలకు సిద్ధం



మా పాఠశాలలో నిర్వహిస్తున్న పునశ్చరణ తరగతులతో మాలో భయం పోయింది. రోజూ రివిజన్ టెస్టులు నిర్వహిస్తుండటంతో పబ్లిక్ పరీక్షలు రాయాలంటే ఎంతో ధైర్యంగా ఉంది. పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు వచ్చినా సమాధానం రాయడానికి సిద్ధం.

–షాఫియా బేగం,10వ తరగతి విద్యార్థిని

ఆత్మవిశ్వాసం పెరిగింది



గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. పరీక్షలకు సన్నద్ధం చేయడానికి ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ఒక్కో గంటసేపు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వీటితో మేము పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తామన్న ఆత్మవిశ్వాసం వచ్చింది.

–మాదిరి రాజేశ్వరి, 10వ తరగతి విద్యార్థిని

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ



పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్న లక్ష్యంతో ఉపాధ్యాయులు సమష్టి బాధ్యత తీసుకున్నారు. చదువులో వెనుకబడిన వారిని గుర్తించి వారి కోసం కొంచెం ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. పరీక్షలలో మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సాహిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా పునశ్చరణ చేయించి, రివిజన్ టెస్టులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల్లో ఆత్మస్థయిర్యం పెంపొందించి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు తోడ్పాటు అందిస్తున్నాం.

–డి.పుష్పలత, గూడూరు జెడ్పీ హెచ్ఎస్ హెచ్ఎం

కార్మిక సంఘ నాయకుడు సత్యనారాయణ మృతి



సత్యనారాయణ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: ఏఐటీయూసీ అనుబంధ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు కరపాటి సత్యనారాయణ (సత్యం) (62) శుక్రవారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మరణించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ మృతికి ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) సంతాపం ప్రకటించారు. సత్యనారాయణ మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, 25వ డివిజన్ కార్పొరేటర్ కొలుసు విజయగంగ, ఆ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ కొలుసు హరిబాబు, కో-ఆప్షన్ సభ్యులు బేతపూడి రవి, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ మొహమ్మద్‌సాహెబ్‌లు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సీపీఐ నాయకులు నివాళులర్పించారు.

కోడి పందేలు ఆడుతున్న ముగ్గురి అరెస్ట్

పెనమలూరు: కోడిపందేలు ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగూరులో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ. 3770, పుంజులు, కత్తులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.



ఆత్మీయ స్వాగతం

విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన త్రైమాసిక ఫీజు చెల్లించే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పామర్రుకు వచ్చారు. ఆయనకు జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రాము, కృష్ణా కలెక్టర్ రాజాబాబు, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, బందరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పేర్ని కిట్టు స్వాగతం పలికారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ